# ప్రభుత్వానికి అనుగుణంగా వైద్య సేవలు అందించాలి

**- వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**





**వరంగల్ బ్యూరో, ఆగస్టు 21,(జర్నలిస్ట్ వార్త):**

వరంగల్ కాశీబుగ్గ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి బుధవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సిబ్బంది పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల పట్ల రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. డెంగీ, మలేరియా, విష జ్వరాలు, ల్యాబ్ టెస్టు రికార్డులు పరిశీలించారు. ఈ మాసంలో ఒక డెంగీ కేసు నమోదై, చికిత్స అందించడం జరిగిందని, ప్రతి రోజు 40 నుండి 50 రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని, ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. వైద్య పరికరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని, జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు అనిపించిన వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి, పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్సి డాక్టర్ కిరణ్, తహశీల్దార్ ఇక్బాల్, సూపర్వైజర్ మోహన్, యూపీహెచ్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో ఇష్టపడి చదవాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**



వరంగల్ బ్యూరో, ఆగస్టు 21,(జర్నలిస్ట్ వార్త):
విద్యార్థులు పట్టుదలతో ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ఆకాంక్షించారు. బుధవారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని వంచనగిరి మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలను, మోడల్ స్కూల్ వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, భోజనంపై ఆరా తీశారు. ఇంటర్ మీడియట్ ఆర్థిక, భౌతిక శాస్త్రానికి సంబంధించిన విషయాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఫిర్యాదుల పెట్టె సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావు, స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, కేర్టేకర్ అరుణ, నాయబ్ తహశీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న రియల్ మాయాజాలం

**- సహకరిస్తున్న స్థానిక అధికారులు**
**- ఎవరి భూములు వారికి తిరిగి ఇవ్వాలి**
**- జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు**



పర్వతగిరి, ఆగస్టు 21,(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండలంలో రియల్ ఎస్టేట్ మాయాజాలం రోజు రోజుకి పెరిగిపోతుంది. బుధవారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు రియల్ అక్రమాలను అరికట్టాలని ఆరోపించారు. వివరాల్లోకి వెళితే పర్వతగిరి రిజర్వాయర్ నుండి కల్లెడ ఊర చెరువులకు వెళ్ళవలసిన కెనాల్ స్థలాన్ని ఆక్రమించి, ఎనిమిది వందల మీటర్ల కెనాల్ విస్తీర్ణంలో లే ఔట్ చేసి, ప్లాట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. అసలు లే అవుట్ పర్మిషన్ ఎలా వచ్చిందన్న విషయమై ఆయన ప్రశ్నిస్తున్నారు. ఓ కెనాల్ స్థలానికి పర్మిషన్ ఇచ్చి, అధికారులు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారులే దళారులుగా మారి, స్వంత ప్రయోజనాల కోసం అడ్డగోలుగా అనుమతులు ఇస్తూ, కబ్జాకోరులకు సహకరిస్తున్నారని అనిల్ రావు ఆరోపించారు. కెనాల్ స్థలాన్ని ప్రక్షాళన చేసి, కల్లేడ గ్రామంలో అసైన్ భూములకు సంబంధించి గతంలో మాజీ మంత్రి వద్ద ఉన్న భూమి నక్క యాకయ్య అనే వ్యక్తికి తిరిగిచ్చారని తెలిపారు. మిగతా అసైన్డ్ భూములు ఎవరైతే తీసుకున్నారో వారి వారికి తిరిగి ఇవ్వాలని అన్నారు. పర్వతగిరి లోని కారంపోడి మిల్లుకు సంబంధించిన 2 ఎకరాల 14 గుంటల భూమిని బినామీ పేర్ల మీద నామమాత్రపు టేండర్ వేయించి, ప్రస్తుతం వారి కొడుకు పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వాటిని కూడా తిరిగి మహిళా సంఘానికి ఇవ్వాలని కోరారు.

# అర్హులందరికీ అందేదాకా రుణమాఫీ: మంత్రి తుమ్మల



ఖమ్మం : రుణమాఫీ విషయంలో అన్నదాతలు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ రుణమాఫీ చేసి తీరుతామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసం కొందరు రైతులను గందరగోళంలో పడేసే మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏనాడూ రైతుల గురించి మాట్లాడనివారు ఇప్పుడు రైతు జపం చేస్తున్నారని, వారి మాటల నమ్మి మోసపోవద్దన్నారు. గడిచిన అయిదేళ్ళ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులు వివిధ బ్యాంకుల్లో తీసుకున్న రుణాల లెక్కలు తీయగా 40 బ్యాంకులకు సంబంధించి 5782 బ్రాంచ్ లలో 41,78,892 ఖాతాల్లో రూ.31 వేల కోట్ల రుణాలను తీసుకున్నట్లు అధికారులు తమకు లెక్కలు చెప్పారని అన్నారు.దానికి అనుగుణంగా ఈ నెల 15లోగా రూ.18 వేల కోట్ల నిధులను ఆయా బ్యాంకులకు విడుదల చేశామన్నారు. మంగళవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 2.26 లక్షల ఖాతాలకు సంబంధించి రూ.24 వేల కోట్ల రుణాలను జమ చేశామని అన్నారు. తెలుపు రంగు రేషన్ కార్డు ఉన్నవారందరికీ రుణ మాఫీ జరిగిందన్నారు. సాంకేతిక కారణాలు, ఆధార్ కార్డులో తప్పులు, బ్యాంక్ అకౌంట్లో తప్పులు, పట్టాభూముల లెక్కల్లో తప్పులు, రేషన్ కార్డులు లేకపోవడం వల్ల కుటుంబసభ్యులను గుర్తించడం ఆలస్యం కావడం తదితర కారణాలతో కొంతమందికి రుణమాఫీ జరగలేదని అన్నారు. అయితే, సాంకేతిక సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నామని, అర్హులదరినీ రుణమాఫీ జరగడానికి కొంత సమయం పడుతుందని అన్నారు.

## జేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా శ్రావణ్ కుమార్




రాయపర్తి, ఆగస్టు 21,(జర్నలిస్ట్ వార్త): భారతీయ జనతా పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మండల కేంద్రానికి చెందిన ఎనగందుల శ్రావణ్ కుమార్ బుదవారం నియమితులైనట్లు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు చేవెళ్ల మహేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తాను గతంలో ఏబీవీపీలో చురుకైనా కార్యకర్తగా అనేక బాధ్యతలు నిర్వర్తించి, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేశానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు బిఆర్ఎస్ నిరసనలు చేవెళ్లలో కెటిఆర్ ఆలేరులో హరీశ్

హైదరాబాద్ **ఆగస్టు 21,(జర్నలిస్ట్ వార్త):** రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం(ఆగస్టు 22) అన్ని మండల కేంద్రాలు/నియోజకవర్గ కేంద్రాల్లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మహేశ్వరం ఎంఎల్ఎ పి. సబితా ఇంద్రారెడ్డి, పలువురు పార్టీ నేతలతో కలిసి చేవెళ్ల మండల కేంద్రంలో రైతుల ధర్నా కార్యక్రమంలో పాల్గొంటారు.సిఎం, మంత్రివర్గం చేస్తున్న మోసానికి వ్యతిరేకంగా గురువారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా ధర్నాలు చేపడతామని కెటిఆర్ ప్రకటించారు. రైతులకు సంపూర్ణ రుణమాఫీ జరిగేంత వరకు బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా నియోజకవర్గాలు, మండల కేంద్రాలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎంఎల్ఎలు, మాజీ ఎంఎల్ఎలు, ఎంఎల్సిలు, మాజీ ఎంఎల్సిలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు,

## తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు న్యాయం చేయాలి..



హైదరాబాద్ **ఆగస్టు 21,(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ మలిదశ ఉద్యమకారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మేడి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన పొలిటికల్ జేఏసీ చైర్మన్ తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి శాలువా కప్పి మెమెంటో బహుకరించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.తదనంతరం రాష్ట్ర అధ్యక్షులు మేడి విజయ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ మలిదశ ఉద్యమ సమయం నుండి ఉధృత సమయం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యేంత వరకు నిరంతరము ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కాగడాలమని ఉద్యమ సమయంలో వందల మంది కలిసి ఉద్యమం చేస్తున్న క్రమంలో ఇద్దరు ముగ్గురు వ్యక్తులను మాత్రమే అరెస్టులు ముందస్తు అరెస్టులు బైండోవర్లు చేసి కేసులు పెట్టినారని వందల మంది లేనిదే ఏ ఒక్కరూ బందులు, రాస్తారోకోలు,నిరాహార దీక్షలు,ముట్టడి వంటి ఏ కార్యక్రమాలు స్వతహాగా చేసి ఉద్యమంలో పాల్గొనలేరని అన్నారు. కేసులు అయిన ఉద్యమకారుల జాబితాలో కేసులు కానీ కీలక సహచర ఉద్యమకారులను చేర్చాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇస్తామన్న 250 చదరపు గజాల ఇంటి స్థలం,ఇంటి నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు,గౌరవ భృతి 25 వేల రూపాయలు,బస్సు, రైలు పాసులు, స్వరాష్ట్రసాధకులుగా గుర్తింపు కార్డులు ఇప్పించాలని కోరుతూ ప్రొఫెసర్ కోదండరాంకు వినతి పత్రం అందచేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నామిరెడ్డి నరసింహారెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ తాజుద్దీన్, జిల్లపల్లి ఇంద్ర, మలపరాజు శ్రీనివాసులు, పగిడిమర్రి నరేష్, జిల్లపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

